# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 02-04-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- వక్ఫ్ చట్ట సవరణ బిల్లుపై లోక్ సభలో ఈ రోజు చర్చ చేపట్టారు.
- జాతీయ విద్యా విధానం-2020 దేశ మేధో పునరుజ్జీవనమని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.
- వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగబద్ధమే అని కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు.
- జమ్మూ కాశ్మీర్‌లో మూడు నూతన నేర చట్టాలను పూర్తిగా అమలు అయ్యేలా చూసేందుకు కేంద్ర ప్రభుత్వం వివిధ కమిటీలను ఏర్పాటు చేసింది.
- వక్ఫ్ సవరణ బిల్లు మీద అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నామని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు తెలిపారు.

=========================

వక్ఫ్ చట్ట సవరణ బిల్లు-2025ను కేంద్ర ప్రభుత్వం లోక్ సభలో ఈ రోజు ప్రవేశపెట్టింది. ఈ కీలక బిల్లుపై లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా సభలో చర్చకు అనుమతించారు. చర్చ సందర్భంగా రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీకి చెందిన ఎన్.కె. ప్రేమచందన్ ఒక పాయింట్ ఆఫ్ ఆర్డర్‌ను లేవనెత్తుతూ జాయింట్ పార్లమెంటరీ కమిటీకి బిల్లులో కొత్త నిబంధనలను చేర్చే అధికారం ఉందా అని ప్రశ్నించారు. దీనికి సమాధానంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా జోక్యం చేసుకుంటూ... ప్రతిపక్షాల డిమాండ్ మేరకే బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపామని గుర్తు చేశారు. కమిటీ తన అభిప్రాయాలను తెలియజేసిందని, వాటిని మంత్రివర్గం సమీక్షించి ఆమోదించిందని చెప్పారు. అనంతరం స్పీకర్ ఓం బిర్లా వక్ఫ్ సవరణ బిల్లు 2025పై మాట్లాడుతూ... జాయింట్ పార్లమెంటరీ కమిటీకి విస్తృత అధికారాలు ఉంటాయని, అది బిల్లును సవరించడమే కాకుండా పునర్నిర్మించగలదని స్పష్టం చేశారు. కాగా, జాయింట్ పార్లమెంటరీ కమిటీ నివేదికల ప్రకారం, కమిటీ ఎన్డీఏ ఎంపీలు ప్రతిపాదించిన 14 మార్పులను అంగీకరించింది.

=========================

జాతీయ విద్యా విధానం (NEP) 2020 కేవలం సంస్కరణ మాత్రమే కాదని, దేశ మేధో పునరుజ్జీవనమని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. జాతీయ విద్యా విధానం నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడమే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా పోటీతత్వాన్ని అందుకునే విధంగా దిశా నిర్దేశం చేస్తుందని అన్నారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఒక వార్తాపత్రికలో రాసిన కథనాన్ని పంచుకుంటూ... నరేంద్ర మోడీ ఈ విషయం వెల్లడించారు. గత దశాబ్దంలో భారతదేశ విద్యా రంగం పురోగతి, పరివర్తనను సాధించిందని అన్నారు. NEP కేవలం విద్యా సంస్కరణ మాత్రమే కాదని, భారతదేశం చాలా కాలంగా ఎదురుచూస్తున్న మేధోపరమైన వలసరాజ్యాల నిర్మూలన అని ప్రధాన మంత్రి స్పష్టం చేశారు.

========================

వక్ఫ్ సవరణ బిల్లు మీద అన్ని వర్గాల అభిప్రాయాలను తీసుకున్నామని కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఈరోజు లోక్‌సభ ముందుకు వక్ఫ్ సవరణ బిల్లును తీసుకువచ్చింది. కిరణ్ రిజిజు ఈ బిల్లు ప్రవేశపెట్టిన తరువాత సభలో ప్రసంగించారు. 1954లో తొలిసారి వక్ఫ్ చట్టం అమల్లోకి వచ్చిందని గుర్తు చేశారు. పార్లమెంట్ ఉభయ సభల సభ్యులతో కూడిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ ముందు మొత్తం 284 మంది ప్రతినిధులు, 25 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల వక్ఫ్ బోర్డుల ప్రతినిధులు తమ వాదనలు వినిపించారని తెలిపారు. ఈ బిల్లులో కొన్ని సానుకూల మార్పులు చేస్తున్నామని కేంద్ర మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 29 సెకన్లు)

========================

వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగబద్ధమే అని కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. లోక్ సభలో ఈ బిల్లు మీద జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ... వక్ఫ్ బిల్లుకు మెజారిటీ వర్గాల మద్దతు ఉందని అన్నారు. వక్ఫ్ బిల్లు అంశంపై విపక్షాలు గందరగోళం సృష్టిస్తున్నాయని అన్నారు. వక్ఫ్ బిల్లు అతిపెద్ద సంస్కరణగా ఆయన అభివర్ణించారు. అనేక రాష్ట్రాల్లో వక్ఫ్ భూములపై కేసులు ఉన్నాయని గుర్తు చేశారు. వక్ఫ్ ఆస్తులను ప్రార్థన, ధార్మిక కార్యక్రమాలకు వినియోగిస్తే ఎలాంటి ఇబ్బంది లేదని చెప్పారు. అయితే వక్ఫ్ భూములను అక్రమాలకు ఉపయోగిస్తే చర్యలు ఉంటాయని హోమ్ మంత్రి స్పష్టం చేస్తూ..

(వాయిస్ 30 సెకన్లు)

========================

జమ్మూ కాశ్మీర్‌లో మూడు నూతన నేర చట్టాలను పూర్తిగా అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం వివిధ కమిటీలను ఏర్పాటు చేసింది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ లోక్‌సభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో ఈ విషయం వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం జమ్మూ కాశ్మీర్ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో స్టీరింగ్ కమిటీని, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఆధ్వర్యంలో సాధికార కమిటీని ఏర్పాటు చేసిందని చెప్పారు. పోలీస్ అకాడమీ, పోలీస్ శిక్షణా సంస్థలు జిల్లా పోలీస్ లైన్స్ బెటాలియన్ శిక్షణా కేంద్రాలలో వీటికి సంబంధించిన శిక్షణా కార్యక్రమాలు నిర్వహించబడతాయని నిత్యానంద్ రాయ్ తెలిపారు.

విరామం

========================

ఇమ్మిగ్రేషన్ ఫారినర్స్ బిల్లు, 2025 బిల్లును హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ రాజ్యసభలో ఈ రోజు ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ఇమ్మిగ్రేషన్ చట్టాలను ఆధునీకరించడానికి ఉద్దేశించబడింది. అలాగే, పాస్‌పోర్ట్‌లు, ప్రయాణ

పత్రాలు, వీసా రిజిస్ట్రేషన్ గురించి కేంద్ర ప్రభుత్వానికి కొన్ని అధికారాలను కల్పించే నిబంధనలు ఇందులో ఉన్నాయి. ఈ బిల్లుని ఇప్పటికే లోక్‌సభ ఆమోదించింది.

========================

ప్రకృతి విపత్తుతో తీవ్ర ఇబ్బందులలో ఉన్న మయన్మార్ దేశానికి భారతదేశం మనవతా దృక్పదంతో తన సాయాన్ని కొనసాగిస్తోంది. ఇప్పటివరకు 625 మెట్రిక్ టన్నుల సహాయక సామగ్రిని భారత్ అందించింది. ఆపరేషన్ బ్రహ్మ'లో భాగంగా 625 మెట్రిక్ టన్నుల మానవతా సాయం, విపత్తు నివారణ సామగ్రిని మయన్మార్‌కు అందించినట్లు భారత విదేశాంగ శాఖ తెలిపింది. సహాయక కార్యక్రమాల నిమిత్తం 6 విమానాలు, 5 నేవీ నౌకలు వినియోగించినట్లు వెల్లడించింది. ప్రకృతి విపత్తు సంభవించినప్పటి నుంచి భారత్ ఇప్పటివరకు మూడు విడతలుగా తన సాయాన్ని పంపించినట్లు పేర్కొంది.

========================

నియంత్రణ రేఖ వద్ద పాకిస్తాన్ సైన్యం చేసిన చొరబాటు యత్నాలను భారత సైన్యం సమర్థవంతంగా భగ్నం చేసిందని సైనిక వర్గాలు వెల్లడించాయి. జమ్ముకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో నియంత్రణ రేఖ LOC వద్ద పాకిస్థాన్ ఆర్మీ చొరబాట్లకు పాల్పడిందని భారత సైనిక వర్గాలు తెలిపాయి. నిన్న కృష్ణ ఘాట్ సెక్టార్ వద్ద పాకిస్థాన్ సైనిక చొరబాట్లకు పాల్పడిందని వెల్లడించాయి. ఈ నేపథ్యంలో ధీటుగా బదులిచ్చిన భారత సైన్యం ఎదురుకాల్పులు జరిపినట్లు సైనిక వర్గాలు తెలిపాయి. ఈ ఘటనలో ఐదుగురు చొరబాటుదారులు మరణించినట్లు తెలుస్తోంది. తమ వైపు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని భారత సైన్యం వెల్లడించింది. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని తెలిపింది.

========================

దేశీయంగా 900 రకాలకు పైగా ఔషధాల ధరలు పెరిగినట్టు నేషనల్ ఫార్మాస్యుటికల్ ప్రైజింగ్ అథారిటీ ప్రకటించింది. ఏప్రిల్ 1 నుంచి కొత్త ధరలు అమలులోకి వచ్చాయి. ఇన్ఫెక్షన్లు, గుండె జబ్బులు, డయాబెటిస్ వంటి వ్యాధుల చికిత్స కోసం ఉపయోగించే ఔషధాలు, పెయిన్ కిల్లర్లు ధరలు 1.74 శాతం పెరిగాయి. టోకు ద్రవ్యోల్బణ సూచీ ఆధారంగా తయారీదారులు ప్రభుత్వం నుంచి ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా ఔషధాల ధరలను సవరించవచ్చునని ఆధారిటీ వర్గాలు పేర్కొన్నాయి.

========================

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ నెల 6వ తేదీన తమిళనాడులోని రామేశ్వరం పర్యటనకు వెళ్లనున్నారు. ఆ రోజున ఆయన ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి మదురై విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుండి వైమానిక దళం హెలికాప్టర్‌లో రామేశ్వరం మండపం క్యాంప్ సమీపంలో ఉన్న హెలిపాడ్‌లో దిగి.. రోడ్డు మార్గం గుండా కారులో పంబన్ వంతెన ప్రాంతానికి చేరుకుంటారు. అక్కడ ప్రత్యేక వేదికపై నుండి దృశ్య మాధ్యమం ద్వారా 550 కోట్ల రూపాయలతో నిర్మించిన పంబన్ వంతెనను ప్రారంభిస్తారు. ప్రధానమంత్రి పర్యటన నేపథ్యంలో అధికార యంత్రాంగం భారీ భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు.

========================

కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ నెల 7, 8వ తేదీలలో రెండు రోజుల పాటు జమ్మూ కాశ్మీర్‌లో పర్యటిస్తారని అధికార వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా ఆయన జమ్మూ కాశ్మీర్ భద్రతా పరిస్థితిని సమీక్షించి భద్రతా సిబ్బందితో సంభాషిస్తారు. ఈ పర్యటన సందర్భంగా రాష్ట్రంలో ప్రస్తుత శాంతిభద్రతల పరిస్థితిని అంచనా వేయడానికి ఉన్నత స్థాయి భద్రతా సమీక్ష సమావేశాన్ని అమిత్ షా నిర్వహిస్తారు. పోలీసులు కేంద్ర సాయుధ పోలీసు దళాలు నిఘా సంస్థల సీనియర్ అధికారులు ఈ సమావేశానికి హాజరవుతారు. అదే విధంగా హోంమంత్రి అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఉన్న ప్రాంతాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తారని అధికార వర్గాలు తెలిపాయి.

=========================

దేశంలోని వాయువ్య భారతదేశంలో వచ్చే 7 రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రత 3 నుండి 5 డిగ్రీల సెల్సియస్ పెరిగే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. సౌరాష్ట్ర కచ్‌లోని వివిధ ప్రాంతాల్లో రాబోయే 7 రోజులలో అధిక వేడి కొనసాగుతుందని వెల్లడించింది. అదే విధంగా ఈ నెల 5 నుండి 8వ తేదీ వరకు పశ్చిమ రాజస్థాన్‌లో వేడిగాలులు కొనసాగే అవకాశం ఉందని తెలిపింది. కాగా, ఈరోజు నుండి ఈ నెల 6 వరకు దక్షిణ ద్వీపకల్ప భారతదేశంలోని అనేక ప్రాంతాలలో ఉరుములు, మెరుపులు వడగళ్ల తుఫానులతో పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది.

=========================

=========================